క్లుప్తంగా

మద్దిలేటయ్య క్షేత్రంలో స్వాతి వేడుకలు

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో జ్యేష్ఠ మాసం స్వాతి వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీమద్దిలేటి స్వామికి వేదపండితులు జ్వాలా చక్రవర్తి, కల్యాణ చక్రవర్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా విశ్వక్సేనారాధన, వాసు దేవ పుణ్యాహవచనం, సుదర్శన హోమం, నవ కలశస్నపనం, నరసింహహోమం పంచామృత సహిత విశేష ద్రవ్య తిరుమంజనం,ధన్వంతరి మూల మంత్ర జపం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ చేసి నైవేద్యాలు సమర్పించి, మహా మంగళహారతి ఇచ్చారు. పూజల్లో ఆలయ ఈఓ పాండురంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీశైల దేవస్థానానికి రూ.2 లక్షల విరాళం



దాతలకు లడ్డు ప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: మీర్జాపురానికి చెందిన బొజ్జ నాగిరెడ్డి, ఆయన కుమారుడు బొజ్జ నాగమల్లేశ్వరరెడ్డి శ్రీశైల దేవస్థానానికి రూ. 2లక్షల విరాళాన్ని గురువారం అందేశారు. దేవస్థానం తరపున నిర్వహించే అన్నదాన పథకానికి రూ. 1,00,001, ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.1,00,001 చొప్పున అందించారు. దాత కుటుంబీకులకు ఆలయ అధికారులు స్వామి వారి లడ్డూ ప్రసాదాలు, శేషవస్త్రాలు అందించి సత్కరించారు.

ఉసేన్‌స్వామి దర్గాకు వాటర్ ఫ్రీజర్ విరాళం

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు గ్రామంలో వెలసిన ఉసేన్‌స్వామి దర్గాకు గురువారం కూలింగ్ వాటర్ ఫ్రీజర్‌ను విరాళంగా అందజేశారు. దర్గాకు వచ్చే భక్తులకు చల్లని తాగునీటిని అందజేసేందుకు వీలుగా గ్రామానికి చెందిన శ్రీరాములు దర్గాలో ఫ్రీజర్‌ను ఏర్పాటు చేశారు.

కబడ్డీ విజేత బేతంచెర్ల జట్టు

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో వీరబ్రహేంద్రస్వామి ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి 20జట్లు పాల్గొనగా పోటీలు హోరాహోరీగా సాగాయి. బేతంచెర్ల జట్టు ప్రథమ, డోన్ ద్వితీయ, నంద్యాల మండలం సాంబవరం తృతీయ, ఆర్‌ఎస్ రంగాపురం జట్టు నాల్గవ స్థానం కైవసం చేసుకున్నాయి. విజేత జట్లకు వరుసగా రూ.10,016, రూ. 8016, రూ.6,016, రూ.4,016 చొప్పున ఆలయ ధర్మకర్త నాగేశ్వర ఆచారి చేతుల మీదుగా అందజేశారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం



చెక్కును అందజేస్తున్న పల్లె సుబ్బలక్ష్మమ్మ

కోవెలకుంట్ల: పట్టణానికి చెందిన సరస్వతీ, సురేంద్ర కుమారుడు త్యాగరాజు చదువుకు స్థానిక ప్రకృతి పీఠం అధ్యక్షుడు, కోవెలకుంట్ల రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సాయం అందజేశారు. తిరుపతిలో ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థికి ప్రపంచ తల్లిదండ్రుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తమ వంతు రూ. 10వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పీఠం సెక్రటరీ పల్లె సుబ్బలక్ష్మమ్మ, సభ్యులు పాల్గొన్నారు.

6138 మంది రైతులకు రైతు భరోసా

కొలిమిగుండ్ల: వైఎస్సార్ రైతు భరోసా 2023 సంవత్సరానికి గాను మొదటి విడత కింద మండలంలో 6138 మంది రైతులకు వర్తించిందని వ్యవసాయాధికారి పవన్‌కుమార్ తెలిపారు. గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పత్తికొండలో నిర్వహించిన రైతు భరోసా కార్యక్రమాన్ని ఆర్బీకే కేంద్రాల్లో రైతులతో కలిసి వ్యవసాయ సిబ్బంది వీక్షించారు. మొదటి విడత కింద రూ.7,500 చొప్పున 6138 మంది రైతులకు రూ.3.30 కోట్లు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ అయిందన్నారు.

8995 మంది రైతులకు లబ్ధి

అవుకు: మండలంలోని 18 గ్రామ సచివాలయాల పరిధిలో 8995 మంది రైతులకు వైఎస్సార్ రైతుభరోసా లబ్ధి చేకూరిందని ఏఓ ప్రసాద్ రావు గురువారం తెలిపారు. రైతుల ఖాతాలోకి పెట్టుబడి నగదును బదిలీ చేసే కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కర్నూలు జిల్లా పత్తికొండలో లాంఛనంగా ప్రారంభించారని తెలిపారు. త్వరలోనే ప్రతి రైతు ఖాతాలోకి నగదు జమ అవుతుందని ఏఓ చెప్పారు.

పోగొట్టుకున్న సొత్తు రికవరీ

బొమ్మలసత్రం: ఓ మహిళ నంద్యాల పట్టణంలో గురువారం తన బ్యాగులో ఉన్న ఏడు తులాల బంగారు ఆభరణాలను పోగొట్టుకున్న ఐదు గంటల్లోనే రికవరీ చేసిన వన్‌టౌన్ పోలీసులను ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి అభినందించారు. ఎస్పీ మాట్లాడుతూ సంజామల మండలం రెడ్డిపల్లికు చెందిన స్వాతి హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్లేందుకు పట్టణానికి చేరుకుంది. ఆటోనగర్ నుంచి ఆటోలో బస్టాండ్‌కు వచ్చింది. అక్కడ తన బ్యాగు కనిపించకపోయే సరికి వెంటనే వన్ టౌ న్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు స్పందించిన సీఐ కృష్ణయ్య ఆటో ప్రయాణించిన మార్గాన్ని సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. ఆటోను తనిఖీ చేయగా బ్యాగు కనిపించింది. బాధితురాలికి ఆభరణాలను అందజేశారని వివరించారు.

పాడిరైతుకు భరోసా!

- పశువులు మరణిస్తే బీమా పరిహారం
- పశువులకు రూ. 30వేలు, జీవాలకు రూ. 6వేల చొప్పున పరిహారం
- మూడేళ్లకాలానికి లబ్ధిదారుల వాటా కింద 20 శాతం ప్రీమియం
- పశువులు మరణించిన 21 రోజుల్లోపే బీమా సాయం
- పశువుల రకాన్నిబట్టి పరిహారం



కోవెలకుంట్లలో పాడి రైతు పెంచుతున్న బర్రెలు

కోవెలకుంట్ల: వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాడి రైతులకు అండగా నిలిచింది. ఏదేని కారణంతో పశువులు మరణిస్తే బీమా వర్తింప చేస్తోంది. గతంలో ఉన్న వైఎస్సార్ పశునష్ట పరిహారం పథకం స్థానంలో పాడి రైతులకు భరోసా కల్పిస్తూ తాజాగా 'వైఎస్సార్ పశు బీమా పథకం' ప్రవేశపెట్టింది. ఈ ఏడాది జూన్ 1వ తేదీనుంచి కొత్త పథకం అమల్లోకి రానుంది. నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో 14.93 లక్షల ఆవులు, గేదెలు, ఎద్దులు, 11.82 లక్షల మేకలు, గొర్రెలు ఉన్నాయి. వివిధ రకాల వ్యాధులు, ప్రమాదశాత్తు, పశువులు, జీవాలు మృత్యువాత పడితే ఈ పథకం ద్వారా పాడి రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుంది. లబ్ధిదారుల వాటా కింద కేవలం రూ. 20శాతం ప్రీమియం చెల్లిస్తే మూడేళ్లపాటు చెల్లుబాటవుతుంది. నెలలు, సంవత్సరాలు తరబడి కాలయాపన లేకుండా పశువు మృతి చెందిన 21 రోజుల్లోపే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో పరిహారం జమ అయ్యేలా విధి విధానాలు రూపొందించారు.

20 శాతం ప్రీమియంతో పరిహారం:

ఈ పథకం వర్తింపునకు ఎస్సీ, ఎస్టీ, నిరుపేద లబ్ధదారులు తమ వాటాగా 20 శాతం, మిగిలిన కేటగిరి పాడి రైతులు 50 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉంది. ఎస్సీ, ఎస్టీ రైతులతోపాటు నిరుపేద పాడి రైతులు సంకరజాతి పశువులకు మూడేళ్లకాలానికి తమ వాటా కింద ఒక్కో పశువుకు రూ. 384 ప్రీమియం కట్టాలి. అదే దేశవాళి పశుజాతికి తమ వాటాగా రూ.480 చెల్లించాలి. ఇతర రైతులు సంకర జాతి పశువులకు రూ. 960 చెల్లించాలి. గొర్రెలు,

జిల్లాలో పశు సంపద వివరాలు:	
తెల్లజాతి పశువులు:	12,0565
నల్లజాతిపశువులు:	2,93,830
గొర్రెలు:	8,82,449
మేకలు :	3,05,854

మేకలు, పందులకు ఎస్సీ, ఎస్టీ, పేద వర్గాలు తమ వాటాగా ఏడాదికి రూ. 38, రెండేళ్లకు రూ. 54, మూడేళ్లకు రూ. 75 ప్రకారం చెల్లించాలి. ఇతర వర్గాల రైతులు ఏడాదికి రూ. 90, రెండేళ్లకు రూ. 135, మూడేళ్లకు రూ. 187.50 ప్రీమియం కట్టాలి. ఒకవేళ మరింత అధిక ధరకు బీమా చేయించుకోవాలంటే పశువు విలువ మేరకు ఎస్సీ, ఎస్టీ రైతులు 7.68శాతం, ఇతర వర్గాల 9.5 శాతం చొప్పున ప్రీమియం చెల్లించాలి.

పశు రకం మేరకు పరిహారం

సంకర జాతికి చెందిన ఆవులు, గేదెలు, ఎద్దులు మరణిస్తే ఒక్కోదానికి రూ. 30 వేలు పరిహారం వర్తిస్తుంది. అలాగే దేశీయ పశుజాతి ఆవులు, గేదెలు, ఎద్దులు మరణిస్తే రూ. 15వేల చొప్పున పరిహారం అందుతుంది. గొర్రెలు, మేకలు, మరణిస్తే ఒక్కోదానికి రూ. 6వేల ప్రకారం పరిహారం ఇస్తారు. ఒక్కో పాడి రైతు కుటుంబానికి బీమా కాలంలో ఐదు గేదెలు, ఆవులు, ఎద్దులకు, 50 మేకలు, గొర్రెలకు వర్తించేలా నిబంధన విధించారు. పాడి ఆవు కనీసం ఒక ఈత(2 నుంచి 10 సంవత్సరాల్లోపు వయసు). అలాగే పాడిగేదె కూడా ఒక ఈత(3 నుంచి 12 సంవత్సరాల వయసు) ఈని ఉండాలి. వ్యవసాయ ఎద్దులు సంకరజాతివి అయితే ఒకట్నిర సంవత్సరం నుంచి 10 సంవత్సరాలు, దేశవాళి ఎద్దులు అయితే 2 సంవత్సరాల నుంచి 10 సంవత్సరాలు వయసు ఉన్న పశువులు బీమా పథకానికి అర్హతగా నిర్దేశించారు. గొర్రెలు, మేకలు, పందులకు ఆరు నెలల వయసు దాటి ఉండాలి. పశువుల వయసును పశువైద్యాధికారులు ధ్రువీకరిస్తారు. బీమా కింద నమోదయ్యే పశువులు, జీవాలకు చెవిపోగు వేస్తారు. ఏదైని కారణంతో పశువులు మరణిస్తే 21 రోజుల్లోపు బీమా కంపెనీ నుంచి పాడి రైతుకు పరిహారం అందజేస్తారు.

బీమా వర్తింపు ఇలా...

- ప్రమాదశాత్తు(వరదలు, తుఫాన్లు, విద్యుత్‌షాక్, పాముకాటు, అడవి జంతువుల దాడి, మంటల్లో చిక్కుకుని, రహదారి, రైల్వే ప్రమాదాలవల్ల) మృతి చెందిన పశువులకు వర్తిస్తుంది.
- ఏదైనా రోగాలు, జబ్బులతో మరణించినా బీమా పథకానికి అర్హత.
- యజమాని నిర్లక్ష్యం కారణంగా, ఎన్‌డీఆర్‌ఎఫ్(విపత్తులు వర్తించే పరిస్థితిఉన్నప్పుడు), ఇతర బీమా పథకాలు వర్తించినప్పుడు, పశువులు దొంగ తనానికి గురైనా, గుర్తింపుచెవిపోగు లేకుంటే బీమా పథకం వర్తించదు.

పాడిరైతులకు ఎంతో ఆసరా



పదిహేను సంవత్సరాల నుంచి పాడిపరిశ్రమను నిర్వహించకుంటూ జీవనం సాగిస్తున్నాను. ప్రస్తుతం 16 బర్రెలను పెంచుతున్నా. ఏదేని కారణంతో పశువులు మరణిస్తే నష్టపరిహారం అందజేసేందుకు ప్రభుత్వం వైఎస్సార్ పశుబీమా పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం పాడి రైతులకు ఎంతో ఆసరాగా ఉంటుంది.

– రవి, పాడి రైతు, కోవెలకుంట్ల

బీమా ఎంతో ఉపయోగం



పాడి రైతులకు అండగా నిలిచి ప్రభుత్వం పశుబీమా పథకం అమల్లోకి తీసుకొచ్చింది. నాలుగు బర్రెలను పెంపకంతో పాడి పరిశ్రమ నిర్వహిస్తున్నా. ఎస్సీ, ఎస్టీ, పేద పాడి రైతులకు కేవలం 20 శాతం ప్రీమియంతో పథకం వర్తింప చేస్తున్నారు. ప్రమాదవశాత్తు, రోగాలబారిన, ఇతర కారణాలతో పశువులు మరణించిన 21 రోజుల్లోపే పరిహారం అందేలా చర్యలు తీసుకోవడం మంచి పరిణామం.

– ప్రతాప్‌రెడ్డి, పాడి రైతు, భీమునిపాడు, కోవెలకుంట్ల మండలం

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



జూన్ 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిన వైఎస్సార్ పశు బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. బనగానపల్లె నియోజక వర్గంలోని మండలాల్లో 13,847 ఎద్దులు, ఆవులు, 72,570 బర్రెలు, 2.04 లక్షల గొర్రెలు, 86,435 మేకలు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ, నిరుపేద రైతులకు 20 శాతం, మిగిలిన రైతులు 50 శాతం ప్రీమియం చెల్లిస్తే మూడేళ్లకాలానికి బీమా వర్తిస్తుంది. పశుపోషకులకు ఈ బీమా ఎంతో ఉపయోగకరం. పశువు రకాన్ని బట్టి మృతి చెందిన పశువు యజమాని బ్యాంకు ఖాతాలో నష్టపరిహారం జమ అవుతుంది.

– కృష్ణకుమార్, పశువైద్యాధికారి, కోవెలకుంట్ల

డోన్ మున్సిపల్ కమిషనర్‌గా వెంకటరామిరెడ్డి

డోన్ : డోన్ నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వర్లు అనంతపురం రీజనల్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పుట్టపర్తి నగరపాలక సంస్థ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆర్. వెంకటరామిరెడ్డిని బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

డోన్ డిప్యూటీ డీఈఓగా సుధాకర్‌రెడ్డి

డోన్ డిప్యూటీ డీఈఓగా సుధాకర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ ఇన్‌చార్జీ డిప్యూటీ డీఈఓగా పనిచేస్తున్న క్రిష్టఫర్ తిరిగి కడప జిల్లా జమ్మలమడుగు ఎంఈఓగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గుంటూరు డిప్యూటీ డీఈఓగా పనిచేస్తున్న సుధాకర్‌రెడ్డిని ఉన్నతాధికారులు నియమించారు.

3న పట్టుబడిన వాహనాల వేలం

బనగానపల్లెరూరల్: బనగానపల్లె పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు ఈ నెల 3న బహిరంగవేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ రామిరెడ్డి గురువారం తెలిపారు. ద్విచక్రవాహనాలు నాలుగు, ఆటోలు మూడు, ఒక కారును బహిరంగ వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొని వాహనాలను దక్కించుకోవాలని సూచించారు.

రెజ్లర్లకు న్యాయం చేయాలి

డోన్ టౌన్: బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను అరెస్టు చేసి మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు షమీం బేగం డిమాండ్ చేశారు. ఢిల్లీలో క్రీడాకారిణులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా డోన్ పట్టణంలోని బేతంచెర్ల సర్కిల్‌లో సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెజ్లర్ ఫెడరేషన్‌లో కొందరు అధికారుల హింసాత్మక, లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా అంతర్జాతీయ అవార్డు గ్రహీతలతో పాటు రెజ్లర్లు చేస్తున్న పోరాటానికి దేశ ప్రజలంతా మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శివరాం, మండల అధ్యక్షుడు రామాంజనేయులు, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి నక్కి హరి, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు అశోక్, సహాయ కార్యదర్శి ఉదయ్ పాల్గొన్నారు.



ఓర్వకల్లు విమానాశ్రయంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

అంకితభావంతో వైద్య సేవలందించాలి

- వైద్య, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి
- సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలి
- డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ

డోన్ : వైద్య, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, అంకితభావంతో వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ సూచించారు. ప్రత్యేకించి సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ఆ దిశగా ప్రజలను చైతన్య పరచాలన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం డోన్ డివిజన్ పరిధిలోని 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వర్తించే ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలకు సమావేశమయ్యారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ప్రభావతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఎంహెచ్ఓ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై రివ్యూ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది హెడ్ క్వార్టర్‌లోనే ఉంటూ ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిని డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణ, సార్వత్రిక టీకా కార్యక్రమం ద్వారా పిల్లలకు టీకాలు వేయించాలన్నారు. డాక్టర్ జగదీష్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌ను విజయవంతం చేయాలని సూచించారు. కీటకజనిత వ్యాధుల గుర్తింపు అన్ని ఫీల్డులో జరగాలని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావ్ సూచించారు. ఫీవర్ సర్వే వంద శాతం పూర్తిచేయాలని, క్షయవ్యాధి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డాక్టర్ మల్లికార్జునరెడ్డి తెలిపారు. కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు సత్వర వైద్యపరీక్షలు నిర్వహించాలని సిబ్బందిని సూచించారు. డాక్టర్ కాంతారావ్‌నాయక్ స్కూల్ హెల్త్ ఆర్‌బీఎస్‌కే కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ ఇంథియాజ్‌ఖాన్, డాక్టర్ నితీష్, డాక్టర్ సుశ్రత, డాక్టర్ మధునిక, డాక్టర్ షాభాగ్, డాక్టర్ మహర్షి సమీవుల్లా, ఆరోగ్యశాఖ అధికారులు రాఘవేంద్రగౌడ్, ప్రభాకర్, లాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



మెడల్స్ సాధించిన విద్యార్థులు

కోవెలకుంట్ల: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని వాసగిరి రత్నమ్మ సేవా ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు వాసగిరి సాయికృష్ణమూర్తి, వాసగిరి శోభారాణి అన్నారు. స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో వేసవి సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్ గురువారం ముగిసింది. ప్రతిభ చాటిన పలువురు విద్యార్థులకు పట్టణానికి చెందిన వాసగిరి రత్నమ్మ సేవాట్రస్టు ఆర్థిక సహకారంతో పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ఆనందాన్ని ఇస్తాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మేరీ, ఫిజికల్ డైరెక్టర్ హర్ష, అక్బర్, చౌడయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి

డోన్ టౌన్: కార్మికులు హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని మోటార్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శివరాం పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) ఆవిర్భవించి యాభైఏళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం స్థానిక వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో నాయకులు జెండా ఆవిష్కరించారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శివరాం మాట్లాడారు. కార్మికులు ఐకమత్యంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో యూనియన్ కమిటీ సభ్యులు ఆదినారాయణ రెడ్డి, హాజీపీరా, రత్నం, లక్ష్మీకాంత ఆచారి, అక్బర్, ఆటో యూనియన్ నాయకులు సుధాకర్, శ్రీనివాసులు, బాలు, తిమ్మయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: కార్మిక హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని లారీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ఎల్లయ్య పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ స్థాపించి యాభైఏళ్లు అయిన సందర్భాన్ని పురస్కరించుకుని నాయకులు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో లారీ, ఆటో డ్రైవర్లు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, మద్దయ్య, నాగేశ్వరరావు, బాషా, మాలిక్ బాషా, హుసేన్ బాషా పాల్గొన్నారు.

పాఠశాలలు తెరిచే నాటికి జగనన్న విద్యా కానుక సిద్ధం



బెల్టులను పరిశీలిస్తున్న ఏపీఎం కృష్ణమూర్తి

ప్యాపిలి: పాఠశాలలు పునఃప్రారంభం అయ్యే జూన్ 12 నాటికి జగనన్న విద్యా కానుక కిట్లు సిద్ధంగా ఉంటాయని ఎంఈఓ శ్రీనివాసులు, ఏపీఎం కృష్ణమూర్తి గురువారం తెలిపారు. మండలంలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 7066 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. విద్యార్థులందరికీ 75 వేల పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉండగా ఇప్పటికే 45 వేలు వచ్చాయని తెలిపారు. యూనిఫాం, బెల్టు, డైరీలు వచ్చాయని తెలిపారు. ఇంకా రావాల్సి ఉన్న 30 వేల పాఠ్య పుస్తకాలతో పాటు స్కూల్ బ్యాగులు రెండు రోజుల్లో ఎమ్మార్సీకి చేరుకుంటాయన్నారు. పాఠశాల పునఃప్రారంభం రోజునే విద్యాకానుక పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు.

పశువైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి



దూడలకు నట్టల మందును తాపిస్తున్న డాక్టర్ భారతీదేవి

అవుకు: పశువైద్య సేవలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని అవుకు పశువైద్యాధికారిణి భారతీదేవి సూచించారు. మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామంలో గురువారం పశువైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. అనారోగ్యానికి గురైన పశువులను పరిశీలించి వైద్య పరీక్షలు చేశారు. దూడలకు నట్టల నివారణ మందు తాపించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ రానున్నది వర్షాకాలమని, పాడి రైతులు, గొర్రెల పెంపకదారులు మూగజీవాల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పశునష్టం జరిగే ప్రమాదం ఉంటుందని తెలిపారు. అనంతరం లివర్ టానిక్స్, మినరల్ మిక్చర్ ప్యాకెట్లను పాడిరైతులకు అందజేశారు. కార్యక్రమంలో వాహనం డాక్టర్ తస్లీమ నజిరూన్, సిబ్బంది హర్ష, మద్దిలేటి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

బేతంచెర్ల: తెలంగాణా రాష్ట్రం జడ్చర్ల టౌన్‌కు చెందిన ఐదుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ శంకర్ నాయక్ గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని గోర్లగుట్ట గ్రామానికి చెందిన దాదగాల్ల రామకృష్ణ, ఏడాది క్రితం తెలంగాణా రాష్ట్రం జడ్చర్ల టౌన్‌కు చెందిన తెలుగు శీరిషను ప్రేమ వివాహం చేసుకున్నాడు. భార్య, భర్తల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో దాదాగాల్ల రామకృష్ణతో భార్య తెలుగు శీరిష, బామ్మర్ది శరత్ చంద్ర, మామ శ్రీనివాసులు, అత్త విజయలక్ష్మి, మరో వ్యక్తి ప్రవీణ్ గొడవ పెట్టుకొని కులంపేరుతో ధూషించారు. బాధితుడు దాదాగాల్ల రామకృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కత్తితో దాడి

బేతంచెర్ల: మండల పరిధిలోని కొలుములపల్లెలో గురువారం ఓ మహిళపై అదే గ్రామానికి చెందిన మరో మహిళ వ్యక్తిగత మనస్పర్థలతో కత్తితో దాడి చేసి గాయపరిచింది. బాధితురాలిని చికిత్స నిమిత్తం బేతంచెర్ల సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు తీసుకెళ్లారు.

యాగంటి ఆలయ పాలక మండలి నియామకానికి దరఖాస్తులు

బనగానపల్లె: మండలంలో ప్రముఖశైవక్షేత్రం యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయానికి పాలక మండలి నియామకానికి దరఖాస్తులు చేసుకోవాలని ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. ప్రస్తుత పాలక మండలి సభ్యుల పదవీ కాలం ఈ నెల 25వ తేదీకి ముగుస్తోందన్నారు. దేవదాయధర్మాదాయ శాఖ నిబంధనల మేరకు ఆసక్తి కలిగిన వ్యక్తులు 20 రోజుల్లోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు కర్నూలు దేవదాయశాఖ ఉపకమిషనర్ కార్యాలయంలో సంప్రదించాలని ఈఓ సూచించారు.

గాలీవాన బీభత్సం

సంజామల: మండలంలో గురువారం ఆర్.లింగందిన్నెలో గాలివాన బీభత్సం సృష్టించింది. ఉదయం నుంచి భానుడి సెగలకు జనం అల్లాడిపోయారు. అయితే ఒక్కసారి వచ్చిన మార్పులతో వాతావరణం చల్లబడింది. గాలివానకు గ్రామంలో కరెంటు స్తంభాలు, చెట్లు విరిగిపడ్డాయి.

90 శాతం వైఎస్సార్ పింఛన్ల పంపిణీ



మీరాపురంలో దివ్యాంగుడికి వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ చేస్తున్న వలంటీర్ నాగేశ్వరమ్మ

బనగానపల్లెరూరల్: వైఎస్సార్ పింఛన్ పంపిణీ ఒకటవ తేదీ గురువారం సూర్యుడు ఉదయించక ముందే ప్రారంభమైంది. వలంటీర్లు లబ్ధిదారుల తలుపుతట్టి పింఛన్ కానుక నగదు అందజేశారు. జీతంలా పింఛన్ అందడంతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు వలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సాయంత్రం 6.30 గంటలకు 90.5 శాతం పూర్తయిందని ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు. మిగిలిన లబ్ధిదారులకు శుక్రవారం సాయంత్రంలోపు పంపిణీ చేసి వంద శాతం పూర్తి చేస్తామన్నారు. మండలంలో మొత్తం 12,226 మంది లబ్ధిదారులకుగాను రూ. 3,40,45,000 మంజూరైందన్నారు.

తొలిరోజు 72 శాతం పంపిణీ

కోవెలకుంట్ల: 'వైఎస్సార్ పింఛన్ కానుక' పథకం ద్వారా లబ్ధిదాలకు జూన్ నెల పింఛన్లు ఠంచన్‌గా అందాయి. కోవెలకుంట్ల మండలంలోని 17 గ్రామ పంచాయితీల్లోని 12 గ్రామ సచివాలయాల పరిధిలో ఈ నెలకు సంబంధించి 5,839 వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, చేనేత, తదితర పింఛన్లు ఉన్నాయి. తొలిరోజు గురువారం ఆయా గ్రామ వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్లి 4,245మందికి అందజేసి 72శాతం సాధించినట్లు ఎంపీడీఓ మహబూబ్ దౌలా పేర్కొన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమం మరో నాలుగు రోజులపాటు కొనసాగుతుందని తెలిపారు.

బేతంచెర్ల: మండల కేంద్రం బేతంచెర్లతోపాటు అన్ని గ్రామాల్లో గురువారం తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆధ్వర్యంలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్ నగదును అందజేశారు.

80 శాతం పింఛన్ పంపిణీ

అవుకు: మండలంలో మొదటి రోజు 80శాతం పింఛన్ పంపిణీ చేసామని ఎంపీడీఓ అజాంఖాన్ గురువారం తెలిపారు. వేకువజాము నుంచే మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వలంటీర్లు లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి వైఎస్సార్ పింఛన్ కానుక నగదు అందజేశారన్నారు. మండలంలో 6600 మంది వివిధ రకాల లబ్ధిదారులు ఉండగా మొదటిరోజే 5273 మందికి పంపిణీ చేశామని, రెండు రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు.

'పది' సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

బనగానపల్లెరూరల్: పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ స్వరూప తెలిపారు. మండలంలో మొత్తం 560 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12,45 గంటల వరకు ఉంటుందని, చీఫ్ ఆఫీసర్స్ నాగభూషణం, పద్మావతి, సుబ్రహ్మణ్యం, డిపార్ట్‌మెంట్ అధికారులుగా భాస్కర్‌రెడ్డి, పుల్లయ్య ఆచారి, భూజంగరావును ఉన్నతాధికారులు నియమించిన్నట్లు ఎంఈఓ తెలిపారు.

కొలిమిగుండ్ల: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం నుంచి పరీక్షలు ప్రారంభం అవుతాయని ఎంఈఓ జిలానీ బాషా తెలిపారు. కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపరింటెండ్‌గా సోమశేఖర్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా పీరాసాహెబ్‌ను నియమించారు. అలాగే మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపరింటెండ్‌గా సత్యనారాయణ, డిపార్టమెంటల్ ఆఫీసర్‌గా వెంకట రమణను నియమించినట్లు చెప్పారు.

ప్యాపిలి: పట్టణంలోని స్థానిక బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం నుంచి నిర్వహించనున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బాలుర ఉన్నత పాఠశాలలో 130 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 288 మంది పరీక్షలకు హాజరు కానున్నట్లు పరీక్షల చీఫ్‌లు మహబూబ్ బాష, విజయ నిర్మలదేవి తెలిపారు.

సంజామల: పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాటు పూర్తిచేసినట్లు ఎంఈఓ డీఎస్ నాయక్ తెలిపారు. విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. మండలంలో 250 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాస్తారన్నారు.